సాక్షి
వికారాబాద్

సోమవారం । 27 । మే । 2024



దుక్కులు దున్నారు..

వానాకాలం సాగుకు రైతన్నలు సన్నద్ధమవుతున్నారు. కానీ ఎరువులు, విత్తనాలు లేక దిక్కులు చూస్తున్నారు. 8లో▸



బీఎస్ఎన్ఎల్.. సేవలు నిల్

ప్రైవేట్ కంపెనీల సెల్‌ఫోన్ల వినియోగం పెరగడంతో ప్రభుత్వం సంస్థ బీఎస్ఎన్ఎల్ ల్యాండ్‌లైన్ సేవలు నిలిచిపోయాయి. 9లో▸



పనిభారం ఎక్కువై!

శాంతిభద్రతల పరిరక్షణలో రక్షకభటులే కీలకం. జనాభాకు సరిపడా సిబ్బంది లేక కేసుల పరిష్కారం నెమ్మదించింది. 9లో▸

న్యూస్‌రీల్

రేపటి నుంచి అడ్మిషన్లు

కొడంగల్: నియోజకవర్గ పరిధి కోస్గి పట్టణంలోని ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలలో జూన్ 27వ తేది నుంచి అడ్మిషన్లు ప్రారంభం అవుతాయని కళాశాల ప్రిన్సిపాల్ పరమేశ్వరి తెలిపారు. ఎంసెట్ ర్యాంకులను బట్టి నిర్వహించే ఆన్‌లైన్ వెబ్ ఆప్షన్ ద్వారా సీట్లను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ కళాశాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) నుంచి అనుమతి లభించినట్లు ఆమె చెప్పారు. కోస్గిలోని పాలిటెక్నిక్ కళాశాలను ఇంజినీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేసినట్లు వెల్లడించారు. సివిల్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ ఇంజినీరింగ్, మెకానికల్ ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లర్నింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (డాటా సైన్స్) కోర్సుల్లో ఒక్కో విభాగంలో 60 చొప్పున మొత్తం 360 సీట్లను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరంలోనే ఆయా సీట్లను భర్తీ చేసి, తరగతులు నిర్వహించనున్నట్లు స్పష్టంచేశారు.

త్వరలో వృత్తి నైపుణ్య విశ్వవిద్యాలయం



స్థలాన్ని పరిశీలిస్తున్న రాణి కుముదిని (ఫైల్)

కొడంగల్: కొడంగల్ నియోజకవర్గానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వృత్తి నైపుణ్య విశ్వ విద్యాలయాన్ని మంజూరు చేసిన విషయం తెలిసిందే. అయితే లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఇప్పటి వరకు పనులు ముందుకు సాగలేదు. జూన్ 4న ఎన్నికల ఫలితాల అనంతరం విశ్వ విద్యాలయానికి సంబంధించిన పనుల్లో పురోగతి కనిపించే అవకాశం ఉంది. నాలుగు నెలల క్రితం రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాణి కుముదిని కలెక్టర్ సి.నారాయణరెడ్డితో కలిసి కొడంగల్, బొంరాస్‌పేట మండలాల్లో అవసరమైన ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. కొడంగల్ మున్సిపల్ పరిధి బూల్కాపూర్ గ్రామ శివారు, బొంరాస్‌పేట మండల పరిధి సర్కారు స్థలాలను పరిశీలించారు. ఈ మండలాల్లో ఎక్కడ ప్రభుత్వ స్థలం అనుకూలంగా ఉంటే.. అక్కడ వృత్తి నైపుణ్య విశ్వ విద్యాలయం ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు అధికార వర్గాల ద్వారా తెలుస్తోంది.

నేడు ఆమనగల్లుకు చిన్నజీయర్‌స్వామి రాక

ఆమనగల్లు: పట్టణంలోని బీఎస్‌ఆర్ గార్డెన్స్‌లో ఈనెల 27న శృతిలయ కల్చరల్ అకాడమీ, వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి సంగీత నృత్య శిక్షణ శిబిరాల ముగింపు నిర్వహిస్తున్నట్లు శృతిలయ కల్చరల్ అకాడమీ వ్యవస్థాపకుడు చిత్తరంజన్‌దాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీ త్రిదండి చిన్నజీయర్ స్వామి హాజరవుతున్నట్లు తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరు కావాలని ఆయన కోరారు.

వినియోగదారుల భద్రత ప్రధానం



సూపర్‌మార్కెట్‌లో బాంబ్ స్క్వాడ్ తనిఖీ

తుర్కయంజాల్: షాపింగ్ మాల్స్‌లో వినియోగదారుల భద్రతే లక్ష్యంగా ఏర్పాట్లు చేయాలని రాచకొండ బాంబ్ స్క్వాడ్ తెలిపింది. సాధారణ తనిఖీల్లో భాగంగా ఆదివారం తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని బీమార్ట్‌లో ఇబ్రహీంపట్నం డివిజన్ రాచకొండ బాంబ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించింది. అనంతరం పలు సూచనలు చేసింది.

మేకల మందపై వీధికుక్కల దాడి

మొయినాబాద్: మేకల మందపై వీధికుక్కలు దాడి చేయడంతో 14 మేకలు మృతి చెందాయి. ఈ సంఘటన మండల పరిధి అమ్డాపూర్‌లో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. అమ్డాపూర్ గ్రామానికి చెందిన దేవేందర్, లలిత దంపతులు మేకలు పెంచుతూ జీవనం సాగిస్తున్నారు. రోజు మాదిరిగానే శనివారం రాత్రి మేకలను ఇంటి పక్కనే మందలో ఉంచారు. ఆదివారం తెల్లవారుజామున గ్రామంలోని వీధికుక్కలు మేకల మందపై దాడి చేశాయి. దీంతో 14 మేకలు మృతి చెందాయి. మృతి చెందిన మేకల విలువ సుమారు రూ.లక్ష వరకు ఉంటుందని.. తమ జీవనాధారమైన జీవాలు మృతి చెందడంతో తీవ్రంగా నష్టపోయామని బాధితులు విలపించారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

‘హరితం’ ఇక వన మహోత్సవం

- హరితహారం పేరు మార్చిన ప్రభుత్వం
- పదో విడత కార్యక్రమానికి సన్నద్ధమవుతున్న అధికారులు
- మొక్కలు ఎక్కువ.. లక్ష్యం తక్కువ
- జిల్లాలో 29.33 లక్షల మొక్కలు సిద్ధం



అంతారంలోని నర్సరీలో సిద్ధంగా ఉన్న మొక్కలు

తాండూరు: కాంగ్రెస్ ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని మహోత్సవం పేరిట నిర్వహించేందుకు సిద్ధమవుతోంది. బీఆర్ఎస్ హయాంలో తొమ్మిది విడతలుగా హరితహారం కార్యక్రమాన్ని నిర్వహించి కోట్లాది మొక్కలు నాటారు. పదో విడతలో భాగంగా మొక్కలు నాటేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. మరో వారం పది రోజుల్లో వర్షాలు పడే అవకాశం ఉన్నందున మొక్కలు సిద్ధంగా ఉంచాలని నర్సరీ నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో 33 శాతం అడవుల పెంపకమే లక్ష్యంగా హరితహారం నిర్వహిస్తున్నారు. అయితే అధికారుల నిర్లక్ష్యం కారణంగా పచ్చదనం 20 శాతం లోపే ఉంది. సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లా కావడం తోపాటు స్పీకర్ ప్రసాద్‌కుమార్ జిల్లాకు చెందిన వారే కావడంతో పర్యావరణ పరిరక్షణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.

బాధ్యతలు అప్పగింత

జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలు, 20 మండలాల్లో పదోవిడత వన మహోత్సవానికి అధికారులు సిద్ధమయ్యారు. 29.33లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 16 ప్రభుత్వ శాఖలకు, నాలుగు మున్సిపాలిటీలకు బాధ్యతలు అప్పగించారు. వర్షాలు పడేలోగా ఉపాధి కూలీలతో గుంతలు తీయించేందుకు సిద్ధమవుతున్నారు.

ఏటా తగ్గుతున్న లక్ష్యం

జిల్లాలో ఏటా హరిత లక్ష్యం తగ్గుతోంది. మొదటి విడత లక్ష్యం 70 లక్షల మొక్కలు కాగా.. తగ్గుతూ గతేడాది 40 లక్షల మొక్కలను నాటారు. ఈ సారి మరో 10 లక్షలను తగ్గించి 29.33 లక్షలకే పరిమితం చేశారు. పచ్చదనం పెంచడంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ కీలకంగా పని చేస్తోంది. ఈ సారి డీఆర్‌డీఏ గ్రామ పంచాయతీల్లో 15లక్షల మొక్కలు నాటాలని లక్ష్యం పెట్టుకుంది. అవెన్యూ ప్లాంటేషన్ పేరిట రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటనున్నారు. జిల్లాలోని 566 గ్రామ పంచాయతీల్లో 42 లక్షల మొక్కలు అందుబాటులో ఉన్నాయి. అటవీ శాఖ ఆధీనంలో మరో 15 లక్షల మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉన్నాయి. మొక్కలు అధికంగా ఉన్నా లక్ష్యాన్ని భారీగా తగ్గించారు. అధికారులు ఆసక్తి చూపించక పోవడంతోనే లక్ష్యాన్ని కుదించారా.. లేకుంటే ప్రజల నుంచి స్పందన కొరవడుతోందా అనే అనుమానం తలెత్తుతోంది.

శాఖల వారీగా నిర్దేశించిన లక్ష్యం

ప్రభుత్వ శాఖ	మొక్కల లక్ష్యం
విద్యాశాఖ	11,000
పశు సంవర్ధక	5,000
ఉద్యాన	2,00,000
పరిశ్రమల	10,000
అటవీ	3,50,000
డీఆర్‌డీఓ	14,00,000
డీపీఓ	4,00,000
గనులు	50,000
పౌరసరఫరాలు	2,000
ఎక్సైజ్	15,000
వ్యవసాయ	2,50,000
మార్కెటింగ్	500
పోలీసు	10,000
నీటి పారుదల	5,000
ఆర్‌అండ్‌బీ	500
డీడబ్ల్యూఓ	1,000
కొడంగల్ మున్సిపల్	50,000
పరిగి మున్సిపల్	43,000
తాండూరు మున్సిపల్	60,000
వికారాబాద్ మున్సిపల్	80,000

“లక్ష్యానికి మించి నాటుతాం



జిల్లాలో వర్షాలు పడగానే మొక్కలు నాటుతాం. జూన్ మొదటి వారంలో గుంతలు తీసే పనులను ప్రారంభిస్తాం. అనుకూల వాతావరణం ఉంటే వెంటనే మొక్కలను నాటుతాం. 566 గ్రామ పంచాయతీల్లో 42 లక్షల మొక్కలు సిద్ధంగా ఉన్నాయి.

\- శ్రీనివాస్, డీఆర్‌డీఓ

అటవీ సంపదను కాపాడుకోవాలి




మనిషి ఆరోగ్యంగా జీవించాలంటే చెట్ల వల్లే సాధ్యం. జిల్లాలో అటవీ సంపదను కాపాడుకోవాలి. సామాజిక అడవులను పెంచాలి. ప్రతి ఇంట్లో ఒక చెట్టు ఉంటేనే పర్యావరణ పరిరక్షణ చేసిన వారమవుతాము. వర్షాలు కురిసిన వెంటనే కార్యక్రమాన్ని ప్రారంభిస్తాం.

\- జ్ఞానేశ్వర్, డీఎఫ్‌ఓ

తిరకాసు!

- విద్యాశాఖలో వసూళ్ల పర్వం
- ఈటీఆర్ పొడిగింపులో కొర్రీలు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: మరో పదిహేను రోజుల్లో కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కాబోతోంది. ప్రారంభమయ్యే నాటికి స్కూలుకు గుర్తింపు పొందితేనే అడ్మిషన్లు పెరుగుతాయనే భావనతో మెజార్టీ ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు ఇప్పటికే ఈటీఆర్ కోసం దరఖాస్తు చేసుకుంటున్నాయి. దరఖాస్తు చేసి రోజులు గడుస్తున్నా.. ఇప్పటికీ వాటి రెన్యూవల్స్ పొడిగించకపోవడంతో ఆయా స్కూళ్లకు చెందిన యజమానులంతా జిల్లా విద్యాశాఖ అధికారి, రీజినల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్‌జేడీ) కార్యాలయాలకు పరుగులు తీస్తున్నారు. ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాల్లో ఉన్న వీక్‌నెస్‌ను విద్యాశాఖలోని పలువురు అధికారులు ‘క్యాష్’ చేసుకుంటున్నారు. ఇక కొత్తగా గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకున్న స్కూళ్ల నుంచి వివిధ అంశాలను సాకుగా చూపించి, అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రైమరీ స్కూలుకు రూ.3 లక్షలు.. హైస్కూలుకు రూ.5 లక్షల వరకు వసూలు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

సాకులు చూపి.. అందినకాడికి..

గ్రేటర్‌లో 4,875 ప్రైవేటు స్టేట్ సిలబస్ స్కూళ్లు ఉండగా, 361 సీబీఎస్ఈ సిలబస్, 35 సీఎస్ఈ సిలబస్‌వి ఉన్నాయి. మరో 220 ప్లేస్కూళ్లు ఉన్నట్లు అంచనా. వీటిలో ఒక్క రంగారెడ్డి జిల్లాలోనే 1,800 పైగా ఉన్నట్లు సమాచారం. వీటిలో మెజార్టీ పాఠశాలలు 1 నుంచి 5 వరకు గుర్తింపు తీసుకుని, ఏడో తరగతి వరకు క్లాసులు నిర్వహిస్తున్నాయి. మరి కొన్ని యాజమాన్యాలు ఏడో తరగతి వరకు అనుమతి తీసుకుని పది వరకు పాఠాలు బోధిస్తున్నాయి. మెజార్టీ ప్రైవేటు స్కూళ్లు రెసిడెన్షియల్ భవనాల్లోనే కొనసాగుతున్నాయి. 90 శాతం బడుల్లో కనీస సదుపాయాల్లేవు. ఫైర్‌సేఫ్టీ కూడా ఉండదు. విద్యాశాఖ అధికారులు దీన్ని అవకాశంగా తీసుకుని, అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. సరూర్‌నగర్, బాలాపూర్, హస్తినాపురం, బీఎన్‌రెడ్డి నగర్, హయత్‌నగర్, వనస్థలిపురం తదితర ప్రాంతాల్లోని పలు స్కూళ్లకు కనీసం పార్కింగ్ సౌకర్యం లేదు. ఇలా కనీస రక్షణ లేని ఈ స్కూళ్లకు ఎలా అనుమతి ఇచ్చారనేది అంతు చిక్కని ప్రశ్నగా మిగిలింది. ఏదైనా విద్యార్థి సంఘం గుర్తించి, జిల్లా విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తే.. తాత్కాలికంగా వారికి షోకాజు నోటీసులు జారీ చేసి వదిలేస్తున్నారు. ఆ తర్వాత వారి నుంచి అందినకాడికి దండుకుంటున్నారనే ఆరోపణలు లేకపోలేదు.



కన్హా శాంతి వనంలో మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ తదితరులు

కన్హా శాంతివనం అద్భుతం

మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్

నందిగామ: ప్రపంచంలోనే అతిపెద్ద ధ్యాన కేంద్రం కలిగి ఉన్న కన్హా శాంతి వనం ఆకు పచ్చని, ఆహ్లాదకరమైన వాతావరణంలో అత్యద్భుతంగా ఉందని మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ అన్నారు. మండల పరిధిలోని శ్రీరామచంద్ర మిషన్, కన్హా శాంతి వనాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీరామచంద్ర మిషన్ గురూజీ, ధ్యాన గురువు కమ్లేష్ పటేల్ (దాజీ)తో కలిసి ధ్యానం చేశారు. అనంతరం మోహన్ యాదవ్ మాట్లాడుతూ.. పచ్చని చెట్లు, పలు రకాలైన ఔషధ మొక్కలు, పండ్లు, పూలు, హార్టీకల్చర్, టిష్యూ కల్చర్ ల్యాబ్‌లు ప్రకృతిని కాపాడేందుకు కావాల్సిన అన్ని వసతులు అద్భుతంగా ఉన్నాయని కొనియాడారు. భారత దేశం అంతటా అంతరించిపోతున్న వృక్షజాతులను సంరక్షిస్తూ, ప్రచారం చేస్తున్న ప్రపంచ స్థాయి టిష్యూ కల్చర్, నర్సరీలు బాగున్నాయని కితాబిచ్చారు. మధ్యప్రదేశ్ ప్రభుత్వం, హార్ట్‌ఫుల్‌నెస్ సంయుక్తంగా ధ్యానాన్ని ప్రపంచానికి పరిచయం చేయడానికి ముందుకు వచ్చాయని అన్నారు. నిరంతరం ధ్యానం చేయడం ద్వారా ప్రతి ఒక్కరూ తమ జీవితాలను చక్కదిద్దుకుంటారని వివరించారు. మధ్యప్రదేశ్ ప్రభుత్వం ఇప్పటికే హరితహారం కార్యక్రమాలకు ఎంతగానో మద్దతు ఇచ్చిందని, మొక్కలు, చెట్ల పెంపకాన్ని ప్రోత్సహిస్తోందని తెలిపారు. రాష్ట్రంలోని జార్వా, రత్లామ్‌లలోని భూముల్లో ఇప్పటికే అడవుల పెంపకం ప్రారంభించినట్లు చెప్పారు. శివఘడ్ వద్ద 2వేల ఎకరాల్లో చెరువులను సృష్టించామని, సిటీ ఫారెస్ట్ ప్రాజెక్ట్‌లో 50 వేల మొక్కలకంటే ఎక్కువ నాటుతున్నట్లు వెల్లడించారు. దాజీ మార్గదర్శకత్వంలో బహుళ స్థాయి విధానాన్ని అనుసరించామని అన్నారు. గత ఫిబ్రవరిలో దాజీ మధ్యప్రదేశ్‌ను సందర్శించిన సమయంలో లక్ష మొక్కలు నాటామని వివరించారు. కార్యక్రమంలో శ్రీరామచంద్ర మిషన్ గురూజీ కమ్లేష్ పటేల్ (దాజీ) హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ నిర్వాహకులు పాల్గొన్నారు.

అందరిచూపు.. పల్లెపోరు వైపు

- ‘స్థానిక’ ఎన్నికలపై దృష్టి
- పోటీకి ఆశావహుల ప్రయత్నాలు
- పెరిగిన పలకరింపులు, మర్యాదలు



షాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్ల తీర్పు ఈవీఎంలలో నిక్షిప్తమైంది. ఎన్నికల తంతు ప్రశాంతంగా పూర్తికావడంతో యంత్రాంగమంతా ఊపిరిపీల్చుకుంది. ఇదే సమయంలో నాయకులు, అధికారులు స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి సారిస్తున్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలని, అందుకు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఇప్పటికే అధికారులకు ఆదేశాలు వచ్చినట్లు తెలిసింది.

ఆశలపల్లకిలో..

ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో గ్రామ, మండల స్థాయిలో కష్టపడిన రాజ పార్టీల నాయకులు ఇప్పుడు తమ లక్ష్యం స్థానిక సంస్థల్లో పోటీ చేయడమే అంటున్నారు. ముఖ్యంగా గ్రామస్థాయిలో సర్పంచ్‌కు పోటీ చేసే విషయంలో ఈసారి గట్టిపోటీ కనిపిస్తోంది. మూడు ప్రధాన పార్టీల మద్దతు, స్వతంత్రంగా బరిలో నిలవాలనుకునే వారు ఆశల లోకంలో విహరిస్తున్నారు. గతంలో పోటీచేసి ఓడిపోయిన వారితోపాటు కొత్త వాళ్లు ఈ పదవిపై కన్నేస్తున్నారు. ఇందుకోసం ఏపార్టీ మద్దతు ఉంటే తమకు లాభం ఉంటుందనే విషయమై ఇప్పటికే అంచనాకు వచ్చి మొన్నటి ఎన్నికల్లో కొందరు పార్టీలు మారారు. ఎంపీ ఎన్నికల ఫలితాల తరువాత పార్టీల మార్పు కొనసాగే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు పార్టీల బీ–ఫారాలు అవసరం ఉండటంతో కొందరు నాయకులు ఇప్పటి నుంచే తమ పార్టీ ముఖ్యులను కలుస్తూ శాసనసభ, లోకసభ ఎన్నికల్లో తాము కష్టపడిన తీరును వివరిస్తూ మద్దతు కూడగట్టే ప్రయత్నం చేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలపైకి అందరి దృష్టి మళ్లడంతో.. ప్రభుత్వం ఎప్పుడు పచ్చజెండా ఊపుతుందా.. ఎన్నికల షెడ్యూల్ ఎప్పుడు ప్రకటిస్తుందా అని ఎదురుచూస్తున్నారు. జీపీ అధికారులు గతంలో చేపట్టిన ప్రక్రియకు అదనంగా అవసరమైన సమాచారాన్ని సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. పోలింగ్ కేంద్రాల విషయంలో స్పష్టత రావాల్సి ఉంది.

వ్యక్తిగత ప్రచారాలు

గ్రామాల్లో ఇప్పటికే ఆశావహులు ఓటర్లను మచ్చిక చేసుకోవడానికి పలకరింపులు, మర్యాదలు, వరుసలు కలుపుతున్నారు. పెళ్లి ఇతర వేడుకలు హాజరవుతున్నారు. వాట్సాప్ స్టేటస్‌లలో ప్రతీ ఒక్కరి పెళ్లి, బర్త్‌డే తెలుసుకొని మరీ విషెస్ చెబుతున్నారు. గతంలో పలకరించని వారు కూడా వ్యక్తిగతంగా ప్రచారాలు చేసుకుంటూ సర్పంచ్, జెడ్పీటీసీ, ఎంపీటీసీగా అవకాశం ఇవ్వాలని వేడుకుంటున్నారు. పల్లెల్లో పోరుకు నోటిఫికేషన్ వెలువడక ముందే ప్రచారాలతో హీటెక్కిస్తున్నారు.

కోడ్ ముగిసిన తర్వాత..

వచ్చే నెల 4న వెలువడే లోక్‌సభ ఎన్నికల ఫలితాల తరువాత ఎన్నికల కోడ్ ముగియనుంది. ఇప్పటికే ప్రభుత్వం కూడా లోక్‌సభ ఎన్నికల తరువాత స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహిస్తామని ప్రకటన చేసింది. ఇదే జరిగితే వచ్చే మూడు నెలలపాటు ఊరూరా కోలాహలమే కనిపించనుంది. ఇప్పటికే గ్రామ పంచాయతీ సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. మొదట సర్పంచ్ ఎన్నికలు జరగాల్సి వస్తే జిల్లాలోని 585 గ్రామ పంచాయతీల్లో నిర్వహించాలి. తరువాత ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. ఇప్పుడున్న రిజర్వేషన్‌లు ఇస్తారా.. లేదా మారుతాయా అనేది కూడా చర్చ జరుగుతోంది.

గాలివాన బీభత్సం

విరిగిపడిన చెట్లు, కరెంట్ స్తంభాలు

గాలివాన బీభత్సం సృష్టించింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం జిల్లాను అతలాకుతలం చేసింది. పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు, భారీ వృక్షాలు నేలకొరిగాయి. ఇళ్లపై రేకులు ఎగిరిపోయాయి. నివాసాల మధ్య చెట్లు విరగడంతో జనం భయాందోళనకు గురయ్యారు. పిడుగులు పడి పశువులు మృత్యువాత పడ్డాయి. ఆదివారం మధ్యాహ్నం వరకు మండుతున్న ఎండలు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేసినా.. అకాల వర్షం ఉపశమనం కలిగించింది. కానీ.. వర్ష బీభత్సం ఆందోళనకు గురిచేసింది.



ధారూరు: కుమ్మర్‌పల్లి గ్రామంలో జేసీబీతో తొలగిస్తున్న చెట్లు

పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం • నాగారం, మైలారం గ్రామాల్లో నష్టం అధికం

ధారూరు/కుల్కచర్ల/పరిగి: ధారూరు మండల పరిధి గ్రామాల్లో కురిసిన గాలివాన జనజీవానాన్ని అస్తవ్యస్తం చేసింది. ఈదురు గాలులతో కూడిన వర్షంతో పలు చోట్ల చెట్లు విరిగాయి. విద్యుత్ స్తంభాలు నేలకొరిగి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. నాగారం, మైలారం, కుమ్మర్‌పల్లి, తరిగోపుల గ్రామాలతో పాటు మైలారం ముందలితండా, అంపల్లితండాల్లో పలు నివాసాలపై చెట్లు విరిగిపడి దెబ్బతిన్నాయి. విద్యుత్ వైర్లు రోడ్లు, ఇళ్లపై తెగిపడటంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఆ సమయంలో సరఫరా లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. మైలారం అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో భారీ వృక్షం నేలకూలింది. దీంతో ప్రజలు పరుగులు తీశారు.

కుల్కచర్లలో..

కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల పరిధి గ్రామాల్లో కురిసిన భారీ వర్షానికి ముజాహిద్‌పూర్ గ్రామంలో రోడ్డుపై చెట్టు విరిగి పడింది. చౌడాపూర్‌లో విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. దీంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది.

పిడుగుపాటుకు ఎద్దుమృతి



పరిగి: ఎద్దు కళేబరం

పరిగి ఈదురు గాలులలో కూడిన వర్షానికి పంట పొలాలు దెబ్బతిన్నాయి. మండల పరిధి రూప్‌సింగ్‌తండాకు చెందిన రాములు ఎద్దు పిడుగుపాటుకు మృతి చెందింది. ఇబ్రహీంపూర్‌లో విద్యుత్ స్తంభం నేలకొరగగా, పాలీహౌస్ నేలమట్టం అయింది.



బొంరాస్‌పేట: హకీంపేట వద్ద రహదారికి అడ్డంగా విరిగిపడిన చెట్లు

తడిసిన ధాన్యం బస్తాలు



గురుదోట్ల కేంద్రంలో తడిసిపోయిన ధాన్యం బస్తాలు

అకాల వర్షం అన్నదాతలను ఆందోళనకు గురిచేసింది. కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం, కొనుగోలు కేంద్రాల్లో పేర్చిన ధాన్యం బస్తాలు తడిసి ముద్దయి కన్నీటి పాలుచేసింది. మధ్యాహ్నం కురిసిన వర్షానికి ధారూరు మండలం మైలారం, కుమ్మర్‌పల్లి, నాగారం, తరిగోపుల, మైలారం ముంలితండా, గురుదోట్ల గ్రామాల్లో ఆరబెట్టిన, సంచుల్లోని ధాన్యం తడిసిముద్దయింది. ఆర బెట్టిన వడ్లను సోమవారం కొనుగోలు కేంద్రాలకు తరలించాలని భావించిన రైతులు తలలు పట్టుకున్నారు. పాలిథిన్ కవర్లు కప్పినా ధాన్యం తడిసిపోయిందని ఆవేదన చెందారు. ఈ ధాన్యాన్ని కేంద్రాల్లో కొనుగోలు చేయరని, మరోసారి ఆరబెట్టి తేమశాతం 17 కన్నా తక్కువగా చేయడం తలకు మించిన భారం అవుతుందని విచారం వ్యక్తంచేశారు.

క్లుప్తంగా

గుర్రం దాడిలో పలువురికి గాయాలు



గుర్రం దాడిలో గాయపడిన వృద్ధుడు

కుల్కచర్ల: గుర్రం దాడిలో నలుగురు గాయపడిన సంఘటన శనివారం రాత్రి మండల పరిధిలో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కుల్కచర్ల మండలం ఘణాపూర్ గ్రామానికి చెందిన వడ్ల రాములుకు 2గుర్రాలు ఉన్నాయి. వారం రోజుల క్రితం గుర్తు తెలియని ఓ గుర్రం వచ్చి వాటితో చేరింది. అయితే కొత్తగా వచ్చిన అశ్వం.. కనబడిన వారిని తన్నడం, ఢీకొట్టడం, కొరకడం చేస్తుండటంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. గుర్రం దాడిలో గ్రామానికి చెందిన నారాయణ, లక్ష్మయ్యలకు స్వల్పగాయాలు కాగా.. హన్నప్ప, వెంకటయ్య తీవ్ర గాయాలతో ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నారు. ఈ మేరకు పలువురు గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గుర్రాన్ని గ్రామం నుంచి తరలించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

పిడుగు పాటుకు గడ్డివాము దగ్ధం



కాలిపోయిన గడ్డి వాము

దోమ: పిడుగు పాటుకు గడ్డివాము దగ్ధమైంది. ఈ సంఘటన మండల పరిధి మల్లేపల్లిలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన చెన్నయ్య అనే రైతు తన పొలంలో పశువుల మేతకోసం ఏర్పాటు చేసిన గడ్డివాము ఆదివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం పడటంతో.. పిడుగు పడి, గడ్డివాము పూర్తిగా కాలిపోయింది. గడ్డి విలువ సుమారు రూ.20 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

లారీని ఢీకొన్న బైకు



గాయపడిన నర్సింలు

తాండూరు టౌన్: రోడ్డుపై నిలిపి ఉంచిన లారీని బైకు ఢీకొన్న ఘటనలో ఓవ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన ఆదివారం సాయంత్రం పట్టణ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. తాండూరు పట్టణం సీతారాంపేట్‌కు చెందిన నర్సింలు.. తాండూరు నుంచి అంతారం వైపు మరోవ్యక్తితో కలిసి బైకుపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో విలియంమూన్ చౌరస్తా సమీపంలో పార్కింగ్ చేసిన లారీని ఢీకొన్నాడు. దీంతో నర్సింలు తల, ముఖంపై తీవ్ర గాయాలు కాగా.. మరో వ్యక్తికి స్వల్పంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు క్షతగాత్రులను తాండూరు జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించగా.. మెరుగైన చికిత్స నిమిత్తం వైద్యులు గాంధీకి రిఫర్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా రోడ్డుపై లారీని నిలిపిన డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని క్షతగాత్రుడి బంధువు దేవదానం డిమాండ్‌చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. ఇదే విషయమై సీఐ సంతోష్ కుమార్‌ను వివరణ కోరగా.. తమకు రాతపూర్వకంగా ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

నంబర్ ప్లేట్ లేని వాహనాలు సీజ్



సీజ్ చేసిన ద్విచక్రవాహనాలు

బషీరాబాద్: నంబర్ ప్లేట్ లేని 9 ద్విచక్రవాహనాలను బషీరాబాద్ పోలీసులు సీజ్ చేశారు. ఆదివారం బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు మార్గాలలో వాహనాల తనిఖీ నిర్వహించారు. నంబర్ ప్లేట్ లేకుండా ద్విచక్రవాహనాలను నడిపిస్తున్న వాటిని గుర్తించి సీజ్ చేశారు. ఈ సందర్భంగా బషీరాబాద్ ఎస్సై రమేష్‌కుమార్ మాట్లాడుతూ.. నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలను నడిపించ రాదన్నారు. వాహనదారులు నంబర్ ప్లేట్‌తో నడపాలన్నారు.

పల్లెల ముఖం చూడని బస్సులు

- బస్సెక్కాలంటే పది కి.మీ. దూరం వెళ్లాల్సిందే
- విద్యార్థులకు శాపంగా మారిన ఆర్టీసీ ప్రయాణం
- ఉన్నత చదువులకు నోచుకోలేక పోతున్న బాలబాలికలు

ప్రపంచం అభివృద్ధిలో రాకెట్ వేగంతో దూసుకుపోతున్నా.. కొన్ని పల్లెలు నేటికీ రవాణా సౌకర్యానికి నోచుకోవడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత రవాణా ప్రయాణం కల్పించినప్పటికీ.. అది వారికి అందని ద్రాక్షగానే మిగిలింది. దేవుడు వరమిచ్చినా.. పూజారి కరుణించడన్నట్లు.. సర్కారు మహాలక్ష్మి పథకానికి పచ్చజెండా ఊపినప్పటికీ.. బస్సులు తిప్పడంలో ఆర్టీసీ విఫలమవుతోంది. దీంతో ఆడ బిడ్డలతో పాటు పల్లె ప్రజలకు రవాణా కష్టాలు తప్పడం లేదు.



బస్సు కోసం విద్యార్థుల నిరసన (ఫైల్)

కుల్కచర్ల: పదో తరగతి పూర్తయిన విద్యార్థులు పైచదువులు చదవాలంటే ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి ఉంటుంది. కానీ బస్సు సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నారు. విద్యార్థులే కాదు.. నిత్యం ఉపాధి, ఇతర పనుల నిమిత్తం పొరుగూరికి వెళ్లాల్సిన వారు.. కొరవడిన రవాణా సౌకర్యంతో ముందుకు సాగలేక పోతున్నారు. చౌడాపూర్ మండలం కొత్తపల్లి గ్రామపంచాయతీతో పాటు కొత్తపల్లితండా, లింగస్‌పల్లి, కల్మన్‌కాల్వకు బస్సు సౌకర్యం లేక పై చదువులకు నోచుకోలేని దుస్థితి నెలకొంది.

ఆటోలు లేకపోతే అంతే..

కుల్కచర్ల, చౌడాపూర్ మండల పరిధి ప్రజలు బస్సు ఎక్కాలంటే సుమారు 10 కిలో మీటర్ల దూరం వివిధ వాహనాలలో వెళ్లాల్సి ఉంటుంది. మూడేళ్ల క్రితం కొత్తపల్లి గ్రామానికి రాకపోకలు సాగించే ఆర్టీసీ బస్సులు.. పలు కారణాలతో నిలిచిపోయాయి. ఇక నాటి నుంచి ఆ పల్లె ప్రజలకు రవాణా కష్టాలు తప్పడం లేదు. ద్విచక్ర వాహనాలు లేని వారు ఆటోలను ఆశ్రయించాల్సి ఉంటుంది. ఆటోలు లేకపోతే ఐదు కిలోమీటర్లు నడిచి, అక్కడి నుంచి ఆటోలో నవాబుపేట మండల కేంద్రానికి వెళ్లాలి. అక్కడి నుంచి బస్సులో గమ్యస్థానానికి చేరుకోవాలి.

పై చదువులకు కష్టం

కొత్తపల్లి, లింగస్ పల్లి, కొత్తపల్లితండా, కల్మన్‌కాల్వ, తంగెడుపల్లి, చాకల్ పల్లి గ్రామాలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో ఆ ప్రాంతాల పిల్లల చదువులు మధ్యలోనే ఆగిపోతున్నాయి. ముఖ్యంగా బాలికలు పదో తరగతి వరకు పల్లెల్లో చదువుకున్నా.. ఇంటర్, ఆపై చదువులకు నవాబుపేట, పాలమూరు జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి ఉంటుంది. కానీ బస్సులు లేక చదువు మధ్యలోనే ఆపేయాల్సి వస్తుందని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వాపోతున్నారు.



బస్సు సౌకర్యం లేని కొత్తపల్లి గ్రామం

పైసలిచ్చి ప్రయాణం చేస్తాం



తమ గ్రామానికి బస్సు సౌకర్యం లేదు. దీంతో బస్సు ఎక్కాలంటే పది కిలో మీటర్ల దూరం వెళ్లాల్సి వస్తోంది. ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్నామని చెబుతున్నా.. అది మాకు అందడం లేదు. పైసలు ఇచ్చి ప్రయాణం చేస్తాం. బస్సు సౌకర్యం కల్పించండి. పొరుగూరుకు వెళ్లాలంటే కష్టంగా ఉంది.

– ఇప్పపల్లి వెంకటమ్మ, కొత్తపల్లి

విద్యార్థులకు తీవ్ర నష్టం



బస్సు సౌకర్యం లేకపోవడం వలన గ్రామీణ ప్రాంత విద్యార్థులకు తీవ్ర నష్టం జరుగుతోంది. కొత్తపల్లి, లింగస్‌పల్లి, కల్మన్‌కాల్వ గ్రామాలకు చెందిన బాలబాలికలు ఉన్నత చదువులకు కష్టంగా ఉంది. నవాబుపేట మండల కేంద్రం వరకు ప్రైవేటు వాహనాల్లో వెళ్లి, అక్కడి నుంచి ఆర్టీసీ బస్సులో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి వెళ్లి ఇంటర్, డిగ్రీ చదవాల్సి వస్తోంది. పల్లెలకు బస్సు సౌకర్యం కల్పించండి.

– రఘు, కొత్తపల్లి

మైసమ్మను దర్శించుకున్న స్పీకర్



అమ్మవారి సన్నిధిలో స్పీకర్ ప్రసాద్‌కుమార్ తదితరులు

అనంతగిరి: వికారాబాద్ మున్సిపాలిటీ పరిధి మద్గుల్ చిట్టంపల్లితండాల్లోని గువ్వల మైసమ్మ అమ్మవారిని ఆదివారం శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్ దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యనారాయణ, పీఏసీఎస్ మాజీ చైర్మన్ కిషన్‌నాయక్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ముత్తాహర్ షరీఫ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రమేష్‌కుమార్, నాయకులు వెంకట్‌రెడ్డి, వెంకటయ్యగౌడ్, తాండ్ర రమేష్, మల్లయ్య, నర్సింలు, లాలు, ఈశ్వర్, బాలునాయక్, శంకర్‌నాయక్, అనంతరాములు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



స్వామివారి కల్యాణోత్సవం

తాండూరు టౌన్: తాండూరు పట్టణం ఆదర్శ తులసీనగర్ కాలనీలోని వరసిద్ధి వినాయక దేవాలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం 6 గంటలకు స్వామి వారికి సుప్రభాత సేవ, 7 గంటలకు ధ్వజారోహణం, 8 గంటలకు అభిషేకం, 8.30 గంటలకు భగవద్గీత పారాయణం, 9గంటలకు హోమం, 10 గంటల నుంచి సిద్ధి, బుద్ధి సహిత, మహా గణపతి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



భగవద్గీతా పారాయణం

కరాటే ఆత్మస్థైర్యం ఇస్తుంది



విద్యార్థులతో మున్సిపల్ చైర్‌పర్సన్ తదితరులు

- మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల
- ముగిసిన ఉచిత కరాటే శిక్షణ తరగతులు

అనంతగిరి: కరాటేతో ఆత్మస్థైర్యం కలుగుతుందని వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల అన్నారు. వికారాబాద్ పట్టణంలోని మేరి నాట్స్ స్కూల్‌లో నెల రోజులుగా మాస్టర్ జపాన్ షోటోకాన్ కరాటే డు అసోసియేషన్ ఇండియా వికారాబాద్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత కరాటే శిక్షణా తరగతులు నిర్వహించారు. ఆదివారం ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా చైర్‌పర్సన్ పాల్గొన్నారు. అనంతరం మాట్లాడారు. ఆత్మరక్షణకు కరాటే ఎంతగానో దోహదపడుతుందని, విద్యార్థులు చిన్నతనంలోనే కరాటేను నేర్చుకోవాలని సూచించారు. విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని చెప్పారు. క్రీడలతో శారీరకంగా, మానసికంగా ఉల్లాసం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉచితంగా క్యాంపు నిర్వహించిన వారికి ఆమె అభినందనలు తెలిపారు. చీఫ్ కోచ్ ఖాజాపాష మాట్లాడుతూ సమ్మర్ క్యాంపులో 60 మంది చిన్నారులు.. వారి తల్లిదండ్రుల ప్రోత్సాహంతో కరాటేలో చాలా విషయాలు నేర్చుకున్నారని తెలిపారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాన్ని బట్టి బెల్టులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. లక్ష్మి అనే విద్యార్థిని బ్లాక్‌బెల్ట్ అందుకున్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎండీ హఫీజ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగుళ్లపల్లి రమేష్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు వెంకట్‌రెడ్డి, కోచ్‌లు విజయ్, మృదుల ప్రియదర్శిని, సాయి, టి.లక్ష్మి సీనియర్ మాస్టర్లు పాల్గొన్నారు.

నెక్లెస్ రోడ్డులో జంతుప్రేమికుల ప్రదర్శన

ఖైరతాబాద్: పెంపుడు జంతువులతో ప్రేమగా మెలగాలని కోరుతూ ఆదివారం నెక్లెస్ రోడ్డులో డాగ్ పార్క్ వద్ద జంతు ప్రేమికులు ప్లకార్డులు ప్రదర్శించారు. ఇటీవల రహమత్‌నగర్‌లో జరిగిన సంఘటన తమను క్షోభకు గురిచేసిందని, ప్రజల్లో జంతువుల పట్ల అవగాహన పెంపొందించడంతో పాటు జంతువుల, మానవ సంబంధాలు మరింత బలపడాలని కోరారు. ఈ సందర్భంగా డాగ్స్‌తో పాటు జంతుప్రేమికులు నిరసన వ్యక్తం చేశారు.

కాలనీ అసోసియేషన్ కార్యవర్గం ఎంపిక

శంషాబాద్: పట్టణంలోని ఎయిర్‌పోర్టు కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్‌ను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా వై.సురేష్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా బూడిద రమేష్ ముదిరాజ్, రాచమల్ల గణేష్‌లను ఎన్నుకున్నారు. ప్రధానకార్యదర్శి బొల్లు సంజయ్(బంటి), సంయుక్త కార్యదర్శులుగా హనుమంతు రావు, శ్రీనివాస్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లేష్‌యాదవ్, కోశాధికారులుగా శ్రీకాంత్‌గౌడ్, సిద్దులు ముదిరాజ్‌లను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గసభ్యులను కాలనీ అసోసియేషన్ నాయకులు తదితరులు ఘనంగా సన్మానించారు.

చిన్న సమస్య ఉన్నా.. మీ ముందుంటా

మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి



మాట్లాడుతున్న సబితారెడ్డి

హుడాకాంప్లెక్స్: ప్రజల సహకారంతో మహేశ్వరం నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. సరూర్‌నగర్ డివిజన్ పోచమ్మభాగ్ (నార్త్) కాలనీవాసులు నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి ఆదివారం ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎటువంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే తక్షణమే వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. తనమీద నమ్మకంతో మహేశ్వరం నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా నిరంతరం అందుబాటులో ఉంటానని చెప్పారు. కాలనీల్లో చిన్న సమస్య ఉన్నా మీ ముందుంటానని తెలిపారు. పార్టీలకు అతీతంగా ప్రజలకు సేవ చేసేందుకు పాటుపడతానని అన్నారు. అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ యూత్ మాజీ అధ్యక్షుడు లోకసాని కొండల్‌రెడ్డి, మాజీ డివిజన్ అధ్యక్షుడు ఆకుల అరవింద్ కుమార్, నాయకులు ఇంటూరి అంకిరెడ్డి, సుశీలారెడ్డి, కేశవరెడ్డి, ఇస్మాయిల్, గొని శ్రీనివాస్, రాజేష్‌గౌడ్, రిషీ, గోవర్ధన్‌రెడ్డి, ప్రత్యూష్, పి.రాజు, జహీర్, సాధిక్, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రాణం తీసిన ఈత సరదా

క్వారీగుంతలో పడి యువకుడి దుర్మరణం



సయ్యద్ మన్నన్ మృతదేహం

ఇబ్రహీంపట్నం రూరల్: ఈత సరదా ప్రాణం తీసింది. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటేశ్ కథనం ప్రకారం.. ఆదిబట్ల మున్సిపల్ పరిధిలోని మంగళ్‌పల్లికి చెందిన సయ్యద్ మన్నన్ (33) స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం కలెక్టరేట్ వెనకాల ఉన్న బోరబండ క్వారీలో ఈతకు వెళ్లారు. అందరూ నీళ్లలోంచి బయటకు రాగా మన్నన్ రాకపోవడంతో వెంటనే పరిశీలించారు. క్వారీలో శ్వాస ఆడక మృతి చెందినట్లు గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇబ్రహీంపట్నం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమించి పెళ్లి చేసుకున్నోడే వేధించాడు!

ఉరివేసుకుని వివాహిత ఆత్మహత్య



కల్పన మృతదేహం

మొయినాబాద్: ఏడు నెలల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నవాడే అదనపు కట్నం కోసం వేధించడంతో ఇంట్లోనే ఉరివేసుకుని గృహిణి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన మండల పరిధిలోని హిమాయత్‌నగర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కడ్తాల్‌కు చెందిన నర్లకంటి మల్లేశ్ కూతురు కల్పన(22) బాసర ట్రిపుల్‌ఐటీ కళాశాలలో బీటెక్ నాలుగో సంవత్సరం చదువుతోంది. నగరంలోని ఆసిఫ్‌నగర్‌కు చెందిన వారి బంధువు బైరంపల్లి శ్రీశైలం కొంత కాలంగా కల్పనను ప్రేమించాడు. గత ఏడాది అక్టోబర్ 29న ఇద్దరూ ఆర్యసమాజ్‌లో ప్రేమ వివాహం చేసుకున్నారు. ఇరు కుటుంబాల ఒప్పందంతో ఈ ఏడాది ఫిబ్రవరి 11న హిందూ సాంప్రదాయం ప్రకారం ఇద్దరికీ పెళ్లి చేశారు. అప్పటి నుంచి శ్రీశైలం కుటుంబం మొయినాబాద్ మండలంలోని హిమాయత్‌నగర్‌లో నివాసం ఉంటోంది. కాగా కల్పన ఇతరులతో ఫోన్‌లో మాట్లాడుతుందని అనుమానించిన శ్రీశైలం మానసికంగా, శారీరకంగా వేధించడంతోపాటు అదనపు కట్నంగా స్విఫ్ట్ కారు ఇప్పించాలని డిమాండ్ చేశాడు. అతనికి తల్లి స్వరూప, బాబాయి రాజు సైతం సహకరించి కల్పనను వేధించారు. వారి వేధింపులు భరించలేక శనివారం రాత్రి ఆమె ఇంట్లోనే చున్నీతో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పర్యాటకులను ఆకట్టుకున్న నేచర్‌క్యాంప్

తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు



సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే పర్యావరణ పర్యాటక కార్యక్రమాల్లో భాగంగా ఏర్పాటు చేసిన రెండు రోజుల నేచర్ క్యాంపు ఆదివారం ముగిసింది. వాన్డేరింగ్ బీ హాలిడేస్ ఆర్గనైజేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన సందర్శకులు పాల్గొన్నారు. పర్యటనలో భాగంగా ట్రెక్కింగ్ , క్యాంప్ ఫైర్ నిర్వహించి వినోద కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. బర్డ్‌వాక్‌లో 17 రకాల పక్షులను తిలకించారు. అడ్వెంచర్స్‌లో భాగంగా రివర్‌క్రాసింగ్, వాలీక్రాసింగ్, క్లైంబింగ్ తదితర కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఆదివారం జరిగిన ముగింపు కార్యక్రమంలో రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రంజిత్ నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సందర్శకుల స్పందనను అడిగి తెలుసుకున్నారు. ఇకపై నిరంతరం నేచర్ క్యాంపులు, ట్రెక్కింగ్, బర్డ్ వాచింగ్, అడ్వెంచర్ కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో ప్రకృతి పర్యాటకానికి పెద్ద పీట వేసి (మద్య నిషేధిత) నేచర్ క్యాంపులను ప్రోత్సాహిస్తామన్నారు. కార్యక్రమంలో ఎకో టూరిజం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస్, ఎకో టూరిజం ప్రాజెక్ట్స్ మేనేజర్ కె.సుమన్,వాండేరింగ్ బీ రంఘవేంద్ర ప్రసాద్, ప్లాంటేషన్ మేనేజర్ లక్ష్మారెడ్డి, బోటనిస్ట్ డాక్టర్. వీరకిషోర్, నేచరలిస్ట్‌లు, శ్రీకాంత్, భాస్కర్, అడ్వెంచర్ ట్రైనర్స్ సంతోష్, నరేష్, బాబు, వెంకటేష్, తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

దుక్కులు దున్నారు.. దిక్కులు చూస్తున్నారు

- అందుబాటులోకి రాని ఎరువులు, విత్తనాలు
- సాగుకు సిద్ధమవుతున్న రైతులు
- కరువైన వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు
- పట్టించుకోని అధికారులు



విత్తనాలు వేసేందుకు సిద్ధం చేసిన సాగుభూమి

పెద్దేముల్: రోహిణి కార్తె వచ్చేసింది. రైతన్నలు వానాకాలం సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే సాగుభూములను దుక్కులు దున్నారు. వానల కోసం ఎదురు చూస్తున్నారు. చినుకు పడితే విత్తనాలు విత్తేందుకు సిద్ధంగా ఉన్నారు. కానీ నేటి వరకు మండలంలో విత్తనాలు, ఎరువుల జాడ లేకపోవడంతో కర్షకులు దిక్కులు చూస్తున్నారు. ఈ సారి కూడా ఎరువుల కొరత తప్పేటట్లు లేదని విచారం వ్యక్తంచేస్తున్నారు. ఇక సాగులో రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చేందుకు సంబంధిత శాఖ అధికారులు అవగాహన కార్యక్రమాలు చేపట్టడం లేదు. గతంలో మంచిరకం వంగడాలను విత్తితే ఆశించిన స్థాయిలో దిగుబడి వచ్చేదని చెప్పేవారు. కానీ ప్రస్తుతం అలాంటి కార్యక్రమాల ఊసేలేదన్నట్లు తెలుస్తోంది.

అధిక ధరలకు విత్తనాలు

ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు, విత్తనాలు పంపిణీ చేయాలని నిబంధనలు ఉన్నా.. మండల కేంద్రంలో అందుకు భిన్నంగా కొనసాగుతోంది. కృత్రిమ కొరత సృష్టించి, ఎరువులు లేవంటూ ఫర్టిలైజర్ దుకాణదారులు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఇదే విషయాన్ని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా.. ఫలితం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. దీంతో వ్యాపారులు ఇష్టం వచ్చిన ధరలకు విక్రయిస్తున్నారని, బిల్లులు అడిగితే ఇవ్వడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. గతంలో ఆగ్రోస్, రైతు సేవా సహకార సంఘం ద్వారా ఎరువులు విత్తనాలు రైతులకు అందుబాటులో ఉండేవి. ప్రస్తుతం ఆగ్రోస్ కనుమరుగయింది. సేవా సంఘం వారు తీసుకురావడం లేదు. దీంతో రైతులు ఎరువులు, విత్తనాల కోసం నానా ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉండేలా చూడాలని రైతులు కోరుతున్నారు. మండలంలో ఏటా సుమారు రెండు వేల మెట్రిక్ టన్నుల డీఏపీ, యూరియా, పొటాష్ ఎరువులు అవసరం ఉంటుందని మండల వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. మండలంలోని 30 రెవెన్యూ గ్రామాల్లో ఖరీఫ్‌కు 24,751 ఎకరాల వ్యవసాయ సాగు భూమి ఉంది. అందుకు సుమారు డీఏపీ–780 మెట్రిక్ టన్నులు, యూరియా–1815ల మెట్రిక్ టన్నులు, పొటాష్–400లు, కాంప్లెక్స్–500 మెట్రిక్ టన్నులు అవసరం ఉందని ఏఓ నజీరొద్దీన్ తెలిపారు.

రాయితీపై అందజేయాలి



అధిక వర్షాలతో మూడేళ్లుగా పంటలు నష్టపోతున్నాం. ఈ ఏడాది 50 శాతం రాయితీతో ఎరువులు, విత్తనాలు అందచేయాలి. గతం ప్రభుత్వం 50శాతం సబ్సిడీపై కందులు, మినుములు, పెసర్లతో పాటు ఇతర విత్తనాలు అందజేసింది. ఇప్పుడు కూడా ఇవ్వాలి. అధిక ధరలకు విత్తనాలు, ఎరువులు విక్రయిస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి.

– రాంచంద్రయ్య, రైతు, బందమిదిపల్లి

ఆగ్రోస్‌ను ఏర్పాటు చేయాలి



మూత పడిన ఆగ్రోస్ కేంద్రాన్ని తెరవాలి. రైతులకు కావలసిన ఎరువులు, విత్తనాలు అక్కడే అందుబాటులో ఉంచాలి. గతంలో ఈ కేంద్రం ద్వారానే వేరుశనగ, కందులు, మినుములు తదితర ఎరువులు అందేవి. 50శాతం సబ్సిడీపై పంపిణీ చేసేది. ప్రస్తుతం అదే విధానం కొనసాగిస్తే.. బాగుంటుంది.

– చంద్రప్ప, రైతు, కొండాపూర్

ఫిర్యాదు చేయండి



ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే ఎరువులు, పత్తి విత్తనాలు ఫర్టిలైజర్ దుకాణదారులు అధిక ధరలకు విక్రయిస్తే ఫిర్యాదు చేయండి. తప్పకుండా వారిపై చర్యలు తీసుకుంటాం. రైతులు ఎక్కడ ఎరువులు, విత్తనాలు ఖరీదు చేస్తే.. అక్కడ బిల్లులు తీసుకోవాలి. బిల్లు ఇవ్వకపోయినా, విత్తనాలు అధిక ధరలకు అమ్మినా వ్యాపారులపై చర్యలు తప్పవు.

– నజీరొద్దీన్, ఏఓ, పెద్దేముల్